స్కూళ్లు కడుతుంటే స్కామ్ అంటున్నరు!

విద్యార్థులకు బహుమతుల ప్రదానంలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ): ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ కడుతుంటే అది స్కామ్ అని తనను విమర్శిస్తున్నారంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వాపోయారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల పిల్లల కోసం రూ.25 వేల కోట్లు ఖర్చుపెట్టి పాఠశాలలు కట్టాల్సిన అవసరం ఏమున్నదని తనను విమర్శిస్తున్నారని ఆరోపించారు. ఎస్సీ గురుకులాల్లో టెన్త్, ఇంటర్‌లో రాష్ట్రస్థాయిలో ప్రతిభ ప్రదర్శించిన విద్యార్థులకు బుధవారం బంజారాహిల్స్‌లోని బాబూ జగ్జీవన్‌రామ్‌భవన్‌లో అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్పొరేట్ కాలేజీలతో పోటీపడేలా ఒక్కో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలను రూ.200 కోట్లు పెట్టి నిర్మించనున్నట్టు తెలిపారు. దళితులు, గిరిజనులు, బలహీనవర్గాల్లో ఆత్మన్యూనతభావాన్ని తొలగించేందుకే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను ఏర్పాటు చేయబోతున్నామని చెప్పారు. సెల్ఫ్ కాన్ఫిడెన్స్‌తో రాణించి తల్లిదండ్రులకు గర్వకారణంగా నిలవాలని సూచించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, వేం నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సుర్వి యాదయ్యగౌడ్

పెండింగ్ బిల్లులు ఇప్పించండి మేడం!

మీనాక్షి నటరాజన్‌కు సర్పంచుల సంఘం జేఏసీ వినతి

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం నుంచి తమకు రావాల్సిన పెండింగ్ బిల్లులు ఇప్పించాలని తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌కు విజ్ఞప్తిచేసింది. ఈ మేరకు బుధవారం ఆమెకు సంఘం జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య వినతిపత్రం అందజేశారు. పెండింగ్ బిల్లుల కోసం ఇప్పటికే గవర్నర్, సీఎంతోపాటు మంత్రులకు వినతిపత్రాలు అందజేశామని గుర్తుచేశారు. రేవంత్‌రెడ్డి సర్కారు పెండింగ్ బిల్లులు చెల్లించకపోగా, తమపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నదని ఆరోపించారు. ఇప్పటికైనా పెండింగ్ బిల్లులు ఇప్పించాలని విన్నవించారు.

'శవాలకు అంత్యక్రియల హక్కు ప్రభుత్వాలకు లేదు'

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ): శవాలకు అంత్యక్రియలు నిర్వహించే హక్కు ప్రభుత్వాలకు లేదని పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ నారాయణ రావు స్పష్టంచేశారు. గతంలో ఎన్‌కౌంటర్‌లో మరణించిన ఉద్యమకారుల శవాలను కుటుంబసభ్యులకు ఇచ్చేవారని గుర్తుచేశారు. ఇప్పుడు శవాలను తీసుకెళ్లకుండా అడ్డుకొని, మృతదేహాలకు సంబంధించిన వారెవరూ రాలేదని కుళ్లబెట్టి, కలెక్టర్ ఆర్డర్‌తో కాల్చివేసి ఏదో విజయం సాధించినట్టుగా పాలకులు ఫీలవుతున్నారని.. ఇది ఎంతో బాధాకరమని పేర్కొన్నారు.

సీఎం కోసం చార్టెర్డ్ ఫ్లైట్?

మొదటిపేజీ తరువాయి...

ఎలా ఉండాలి? ఎటువంటి ఫ్లైట్ కొనుగోలు చేయాలి? అనే అంశం మీద అధికారులతో ప్రత్యేక కమిటీ వేసినట్టు విశ్వసనీయవర్గాల సమాచారం. అధికారం చేపట్టిన ఈ 17 నెలల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 44 సార్లు ఢిల్లీకి వెళ్లి వచ్చారు. ఓ వైపు నన్ను కోసినా రూపాయి రాదంటూనే సీఎం రేవంత్‌రెడ్డి రూ.150 కోట్ల ప్రజాధనం దుబారా చేయడంపై ఆర్థిక నిపుణులు విస్మయం వ్యక్తంచేస్తున్నారు.

కార్మికశాఖలో పదోన్నతులు

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ): కార్మికశాఖలో ఇద్దరు సహాయ కమిషనర్లకు ఉప కమిషనర్లుగా పదోన్నతి కల్పించి పోస్టింగ్ ఇచ్చారు. జీ బాల నర్సింహ స్వామిని నల్లగొండ, కోలా ప్రసాద్‌ను కరీంనగర్ డీసీఎల్‌గా నియమిస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. బాల నర్సింహస్వామి, కోలా ప్రసాద్‌తోపాటు సహాయ కమిషనర్లు ఎం కోటేశ్వర్లు, పీ ప్రభావతిని ఉప కమిషనర్లుగా ఉద్యోగోన్నతికి డిపార్ట్‌మెంటల్ కమిటీ సిఫారసు చేయగా, వాటిని ఆమోదిస్తూ కార్మికశాఖ ముఖ్యకార్యదర్శి దాన కిషోర్ ఉత్తర్వులు జారీచేశారు. ఉప కమిషనర్ పీ జగదీశ్‌కుమార్‌ను డిప్యూటేషన్‌పై జీహెచ్‌ఎంసీలో పర్సనల్ ఆఫీసర్‌గా నియమించారు.

యంగ్ బడితో 'తొండాట'

మొదటిపేజీ తరువాయి...

గురుకులాలను నిర్మించనున్నది. పైలట్ ప్రాజెక్ట్‌గా కొడంగల్, మధిరలో నిర్మిస్తున్నారు. మరో 55 యంగ్ ఇండియా గురుకులాల నిర్మాణానికి ప్రభుత్వం పరిపాలన అనుమతులు మంజూరుచేసింది. తాజాగా మంగళవారం 20 స్కూళ్ల నిర్మాణానికి పరిపాలన అనుమతులు జారీచేసింది. మొదట్లో రూ.85 కోట్లతో వీటిని నిర్మిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గత ఏడాది జూలైలో ప్రకటించారు. కానీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిరుడు అక్టోబర్ 11న రూ.125 కోట్లతో రంగారెడ్డి జిల్లా కొందుర్గులో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. తాజాగా మంగళవారం రూ.200 కోట్లతో ఒక్కో గురుకులాన్ని నిర్మించనున్నట్టు ప్రభుత్వం జీవో జారీచేసింది. కేవలం పది నెలల కాలంలో ఒక్కో స్కూలు నిర్మాణ వ్యయాన్ని రూ.85 కోట్ల నుంచి రూ.200 కోట్లకు పెంచేశారు. అంటే మొత్తంగా 78 గురుకులాలను దాదాపు రూ.16వేల కోట్లతో నిర్మించబోతున్నారు. రూ.8వేల కోట్లు అయ్యే దానికి రూ. 16వేల కోట్లకు పెంచారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఖరారైన టెండర్లలోనూ తేడాలు

తొలి విడుతలో ఇప్పటికే కొన్ని గురుకులాల నిర్మాణానికి తెలంగాణ విద్య, సంక్షేమ మౌలిక వసతుల కల్పన సంస్థ (టీజీఈడబ్ల్యూఐడీసీ) టెండర్ల ప్రక్రియను పూర్తిచేసింది. ఇవన్నీ రాష్ట్ర మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న అసెంబ్లీ నియోజకవర్గాలే. మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న హుస్నాబాద్‌లో నిర్మించే వైఐఐఆర్‌ఎస్ అంచనా వ్యయం రూ.1.35.35 కోట్లు. మరో మంత్రి జూపల్లి నియోజకవర్గం కొల్లాపూర్‌లోని గురుకులం నిర్మాణ వ్యయం రూ. 136.36 కోట్లు. మంత్రి తుమ్మల నియోజకవర్గం ఖమ్మంలో నిర్మించేదాని వ్యయం రూ. 145.59 కోట్లు. మంథనిలో రూ.139.69 కోట్లు, షాద్‌నగర్‌లో రూ. 138.40 కోట్లు, నల్లగొండలో రూ.141.39 కోట్లు, పాలేరులో రూ. 145.37 కోట్లు, ములుగులో రూ.144.75 కోట్లు. వీటి నిర్మాణానికి టీజీఈడబ్ల్యూఐడీసీ టెండర్ల ప్రక్రియను పూర్తిచేసింది. ఒక దగ్గర రూ. 125 కోట్లు, మరో దగ్గర 136 కోట్లు, ఇంకోచోట రూ.145కోట్లు. ఇదెలా అని ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

అసలు వీటి అవసరమేంటి.. ?

యంగ్ గురుకులాల విషయంలో ప్రభుత్వానికి ప్రణాళికలోపం, స్పష్టత కరువయ్యిందన్న వాదనలున్నాయి. అసలు ఈ యంగ్ గురుకులాలు అవసరమా.. అన్న చర్చ జరుగుతున్నది. రాష్ట్రంలో ఇప్పటికే 1,200 గురుకులాలున్నాయి. 26వేల పైచిలుకు ప్రభుత్వ బడులున్నాయి. రాష్ట్రంలో బడిలేని ఊరు లేదు. ప్రతి గ్రామంలో ప్రభుత్వ బడులున్నాయి. మళ్లీ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను నిర్మించాల్సిన అవసరమేంటన్న ప్రశ్నలొస్తున్నాయి. ఇప్పటికే దాదాపు రెండు వేల వరకు సర్కారు బడుల్లో ఒక్కరంటే ఒక్క విద్యార్థి కూడా లేరు. ఇవన్నీ మూసివేత దిశలో సాగుతున్నాయి. బడుల రేషనలైజేషన్ చేయాలంటూ కేంద్రం తరచుగా రాష్ట్రానికి ఆదేశాలిస్తున్నది. ఈ పరిస్థితుల్లో యంగ్ గురుకులాలు అవసరమే లేదన్న వాదనలొస్తున్నాయి.

సొంతభవనాలు కట్టొచ్చుగా..

విద్య, వైద్యం మా మొదటి ప్రాధాన్యం.. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు 15శాతం నిధులను కేటాయిస్తాం అన్నది కాంగ్రెస్ పార్టీ హామీ. కానీ గత రెండు బడ్జెట్లలో కేవలం ఏడు శాతం నిధులను మాత్రమే కేటాయించింది. రాష్ట్రంలో ఇప్పటికీ టాయిలెట్లు, నీళ్లు లేని సర్కారు బడులున్నాయి. బాలురకు టాయిలెట్లు లేని స్కూళ్లు 4,740, బాలికలకు మూత్రశాలలు లేనివి 1,704 ఉన్నాయి. ఇప్పటికి విద్యుత్తు కనెక్షన్లు లేనివి స్కూళ్లు 7,472 ఉన్నాయి. యంగ్ బడులకు వెచ్చించే ఈ రూ.16వేల కోట్లతో సర్కారు బడుల్లో వసతులు కల్పించవచ్చు. గత కేసీఆర్ సర్కారు ప్రారంభించిన గురుకులాలకు సొంత భవనాలు కట్టొచ్చు. రూ. 30 –35 కోట్ల ఖర్చు చేస్తే అద్భుతమైన భవనాలు సిద్ధమవుతాయి. ఇవేవి కాకుండా ఒక్కో గురుకులానికి రూ.200 కోట్లు ఖర్చుచేయడమెందుకు అన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పైసల్లేవంటూ.. ఆడంబరమేంది?

రాష్ట్రానికి వచ్చే ఆదాయం తగ్గింది. నన్ను కోసుకుతిన్నా రూపాయి రాలదంటూ సాక్షాత్తు సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల బహిరంగంగా ప్రకటించారు. జీతాలిద్దామన్నా.. అప్పుపుడుతలేదని, అప్పు కోసం వెళితే దొంగల్లాగా చూస్తున్నారని వ్యాఖ్యానించారు. మరి కేవలం 78 గురుకులాలకు రూ.16వేల కోట్లు ఖర్చుచేయడందేనికి అని పలువురు ప్రశ్నిస్తున్నారు. 20 ఎకరాల్లో రూ.50 కోట్ల నుంచి రూ.70కోట్లతో గత కేసీఆర్ సర్కారు ఏకంగా 25 ఇంటిగ్రేటెడ్ జిల్లా కలెక్టరేట్లను నిర్మించింది. మరి ఒక్క యంగ్ గురుకులానికి రూ. 200 కోట్లెందుకన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

ముఖ్యనేత సన్నిహితుల కోసమేనా?

యంగ్ ఇండియా బడుల అంచనాల పెంపు వెనుక ముఖ్యనేత సన్నిహితుల హస్తమున్నట్టు ప్రచారం జరుగుతున్నది. కమీషన్లు కూడా ఖరారయ్యాయన్న ఆరోపణలొస్తున్నాయి. ఓ నేత ఇప్పటికే చక్రం తిప్పేశారట. వీటి నిర్మాణాన్ని ఓ సంస్థకు అప్పగించేందుకు రంగం సిద్ధమయ్యిందట. దీంతో అడ్డగోలుగా అంచనాలు పెంచారన్న ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి.

వ్యయం పెంచు.. కమీషన్ దంచు!

- ఇదా కాంగ్రెస్ మార్కు అంటే..?
- తట్టెడుమట్టి తీయకుండానే నిర్మాణ వ్యయం రెట్టింపు
- మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ): జలయజ్ఞం నుంచి రెసిడెన్షియల్ స్కూళ్ల వరకు నిర్మాణ వ్యయాలను పెంచడం, కమీషన్లు దంచడం.. ఇదేనా కాంగ్రెస్ మార్కు ప్రజాపాలనా? అని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. తట్టెడు మట్టి తీయలేదుగాని నిర్మాణ వ్యయాన్ని కోట్లకు కోట్లు పెంచడం కాంగ్రెస్‌కే చెల్లిందని విమర్శించారు. ఇది యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ పేరిట వేల కోట్లు దండుకునేందుకు కాంగ్రెస్ సర్కారు ఆడుతున్న మరో నాటకమని మండిపడ్డారు. 'ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను రూ.80 కోట్ల –100 కోట్లతో నిర్మిస్తామని గత ఏడాది జూలై 24న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదిలాబాద్‌లో ప్రకటించారు. కానీ, సీఎం రేవంత్‌రెడ్డి నిరుడు అక్టోబర్ 11న రూ.125 కోట్లతో రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వివిధ జిల్లాల్లో ఏర్పాటుచేసే ఈ స్కూళ్లకు ఈ నెల రెండోవారంలో రూ.135 కోట్ల–150 కోట్లతో టెండర్లు సైతం ఖరారు చేశారు. ఈ నెల 27న 20 స్కూళ్ల నిర్మాణం కోసం రూ.4,000 కోట్లతో పరిపాలన అనుమతులు మంజూరు చేస్తూ జీవో నం. 96 విడుదల చేశారు. అంటే ఒక్కో స్కూల్ అంచనాలను పని మొదలు కాకుండానే మూడు రెట్లు, అంటే రూ.200 కోట్లకు పెంచారు. జలయజ్ఞం నుంచి రెసిడెన్షియల్ స్కూళ్ల వరకు అంచనాలను పెంచడం, కమీషన్లు దంచడం.. ఇదేనా కాంగ్రెస్ మార్కు ప్రజా పాలనా?' అని హరీశ్‌రావు బుధవారం ఓ ప్రకటనలో నిలదీశారు.

తడిసిన ధాన్యాన్ని కొనండి..

ప్రభుత్వ వైఫల్యం కారణంగా రైతన్నలు వడ్లకుప్ప మీదే రాలిపోతున్నారంటూ హరీశ్‌రావు ఓ కవిత రూపంలో ఆవేదన వ్యక్తం చేశారు. తన కవితను ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. రైతన్నకు క్షమాపణ చెప్పి, వెంటనే తడిసిన ప్రతి గింజను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

యంగ్ ఇండియా గురుకులాల కాన్సెప్టే రాంగ్

నిజానికి సమీకృత గురుకులాల వ్యవస్థే రాంగ్. పేరాశతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసేందుకే ఈ గురుకులాలను తెరపైకి తెచ్చారు. ఉప ముఖ్యమంత్రి గారేమో 85 కోట్లంటారు. సీఎంగారేమో రూ.125కోట్లతో చేపట్టిన భవనానికి శంకుస్థాపన చేస్తారు. ఇప్పుడేమో రూ. 200 కోట్లకు జీవోలిస్తారు. ఇదేం పద్ధతి. మన ఊరు –మన బడి పథకాన్ని ఆపేశారు. సీఎం బ్రేక్‌ఫాస్ట్‌ను ఆపేశారు. గురుకులాలను గాలికొదిలేశారు. యంగ్ గురుకులాలకు బదులు పక్కాభవనాలు లేని స్కూళ్లకు భవనాలు నిర్మిస్తే సరిపోయేది. ఇప్పటికైనా సర్కారు కండ్లు తెరిచి ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలి.

– రావుల శ్రీధర్‌రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్

ఏ కాంట్రాక్టర్ జేబులు నింపబోతున్నారు?

యంగ్ ఇండియన్ సంస్థ పేరుతో విరాళాలు సేకరించడం మీద రాహుల్‌గాంధీపై విచారణ జరుగుతున్నది. యంగ్ ఇండియా స్కిల్‌వర్సిటీ పేరుతో అదానీ, మెగా కృష్ణారెడ్డి నుంచి విరాళాలు సేకరించారు. ఇది వివాదాస్పదమయ్యింది. ఇప్పుడు యంగ్ ఇండియా గురుకులాల నిర్మాణం పేరుతో వందల కోట్ల అంచనాలు పెంచేశారు. గతంలో మూసీ ప్రక్షాళన పేరుతో పలు దఫాలు అంచనాల వ్యయం పెంచారు. యంగ్ గురుకులాల విషయంలోనూ అనుమానాలున్నాయి.

– మన్నె క్రిశాంక్, బీఆర్‌ఎస్ సోషల్ మీడియా

'ఆంధ్రజ్యోతి'ది జర్నలిజమా? శాడిజమా?

- నాపై అసత్య వార్తలు వండివార్చిన పత్రిక
- నన్ను సంప్రదించకుండా నాపైనే వార్త ఏలా ప్రచురణ?
- ఆ వార్త పూర్తిగా ఫేక్ : ఎమ్మెల్సీ కవిత తీవ్ర మండిపాటు

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ): 'ఆంధ్రజ్యోతి'ది జర్నలిజమా? లేక శాడిజమా? అని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధ్వజమెత్తారు. తనపై ఆ పత్రికలో తప్పుడు కథనాలు ప్రచురితం కావడంపై ఆమె తీవ్రంగా ఖండించారు. తనను సంప్రదించకుండా తనపైనే వ్యతిరేక వార్త ఎలా రాస్తారని ఆ పత్రిక యాజమాన్యంపై బుధవారం ఎక్స్ వేదికగా కవిత నిప్పులు చెరిగారు. 'కాంగ్రెస్‌తో రాయబారం! హస్తం గూటికి చేరేందుకు కవిత యత్నాలు, మధ్యవర్తి ద్వారా అధిష్ఠానంతో సంప్రదింపులు' వంటి శీర్షికలతో తనపై 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో వచ్చిన వార్తను తీవ్రంగా ఖండించారు. ఆ దినపత్రికలో వచ్చిన వార్తలో ఏ మాత్రం నిజం లేదని స్పష్టంచేశారు. ఈ వార్త రాసే క్రమంలో కనీసం తనను సంప్రదించ లేదని ఆమె ఆగ్రహం వ్యక్తంచేశారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అల్లం నారాయణ, జూలురి గౌరీశంకర్, మారుతీ సాగర్

ఉద్యమంలో టీజేఎఫ్ పాత్ర చరిత్రాత్మకం

- మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ

ఖైరతాబాద్, మే 28: తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన టీజేఎఫ్ రజతోత్సవాల పోస్టర్‌ను మీడియా అకాడమీ మాజీ చైర్మన్, ఫోరం అధ్యక్షుడు అల్లం నారాయణ, తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతీ సాగర్ ఆవిష్కరించారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో అల్లం నారాయణ మాట్లాడుతూ.. తెలంగాణ మలి దశ ఉద్యమంలో మొదలైన టీజేఎఫ్ ప్రస్థానం.. ప్రత్యేక రాష్ట్రావిర్భావం తర్వాత కూడా టీయూడబ్ల్యూజేగా జర్నలిస్టుల సమస్యలపై పోరాడుతున్నదని చెప్పారు. ఉద్యమకాలంలో సాగరహారం మొదలు మిలియన్ మార్చ్ వరకు, ఆపై తెలంగాణ బిల్లు ప్రవేశపెట్టే సమయంలో టీజేఎఫ్ పోషించిన పాత్ర చరిత్రాత్మకమని తెలిపారు. ఈ నెల 31న జలవిహార్‌లో జరిగే రజతోత్సవ వేడుకల్లో నాడు టీజేఎఫ్‌తో కలిసి నడిచిన అన్ని పార్టీల నాయకులు, ఉద్యోగ, ప్రజా సంఘాలు, మేధావులు పాల్గొంటారని వెల్లడించారు. ఈ వేడుకలు ఏడాదిపాటు కొనసాగుతాయని, 2026 మే 31న ముగింపు సందర్భంగా జర్నలిస్టులు, టీజేఎఫ్ ఉద్యమ ప్రస్తానంపై పుస్తకావిష్కరణ ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల సంఘం కార్యదర్శి ఏ రమణకుమార్, ఐజేయూ నేత అవ్వారి భాస్కర్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర కోశాధికారి పీ యోగానంద్, సహాయ కార్యదర్శి యార నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అద్దెకు ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్

క్యాంపు ఆఫీస్‌లోనే జాతీయ పసుపు బోర్డు కార్యాలయం

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ): వినయ్‌నగర్‌లోని నిజామాబాద్ రూరల్ అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాతీయ పసుపు బోర్డు ప్రధాన కార్యాలయం ఏర్పాటు కానున్నది. ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసును పసుపు బోర్డుకు అద్దెకు ఇచ్చేందుకు ఆర్‌అండ్‌బీశాఖ చీఫ్ ఇంజినీర్ చేసిన ప్రతిపాదనను ఆమోదిస్తూ.. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. దీంతో ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌లో అద్దె ప్రాతిపదికన పసుపు బోర్డు కార్యాలయాన్ని నిర్వహించనున్నారు.

అధికారులకు సమస్యలను వివరిస్తున్న భూ నిర్వాసిత రైతులు

మా శవాలపై ప్రాజెక్టు కట్టండి

- పరిహారం ఇవ్వకుంటే జరిగేది అదే
- ఎకరాకు 60లక్షల పరిహారం, ఇంటికో ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి
- గ్రామసభల్లో తేల్చిచెప్పిన నారాయణపేట, కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ భూ నిర్వాసితులు

ఊట్కూర్, మే 28 : 'నారాయణపేట –కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్‌లో భూములు కోల్పోతున్నవారంతా చిన్న, సన్నకారు రైతులం. మా తాత ముత్తాతలు, తండ్రుల కాలం నుంచి వ్యవసాయాన్ని నమ్ముకుని బతుకుతున్నాం. బంగారు పంటలు పండే మా భూములను కోల్పోతే మాకు భవిష్యత్తు ఉండదు. మేము కోరిన భూ పరిహారం ఇవ్వండి.. లేదంటే మా శవాలపై లిఫ్టు పనులు ప్రారంభించండి' అని ఊట్కూర్ మండల కేంద్రం (దంతన్‌పల్లి) శివారు రైతులు జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌కు తేల్చిచెప్పారు. బుధవారం నారాయణపేట జిల్లా ఊట్కూర్ గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో నారాయణపేట–కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న ఆర్‌అండ్‌ఆర్ రైతులతో రెవెన్యూ అధికారులు గ్రామసభ ఏర్పాటు చేశారు. దంతన్‌పల్లి శివారులో ఓపెన్ కెనాల్ నిర్మాణం కింద భూములు కోల్పోతున్న రైతుల వివరాలను సభలో వినిపించారు. పూర్తిగా వ్యవసాయ భూములు కోల్పోయిన రైతులను గుర్తించి వారికి ప్రభుత్వం ద్వారా అందే పరిహారంతో పాటు పునరావాసం–పునరాశ్రయం ద్వారా అదనపు లాభాలు వర్తింప చేస్తామని, ప్రాజెక్టు నిర్మాణ పనులకు సహకరించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ కోరారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న వారిలో చాలా మంది చిన్న, సన్నకారు రైతులమే ఉన్నామని, ఉన్న భూమి కోల్పోయి తమకు ఎకరా, అర ఎకరా భూమి మాత్రమే మిగిలితే వ్యవసాయం ఏ విధంగా చేసుకోవాలో చెప్పాలని నిలదీశారు. దంతన్‌పల్లి శివారులో ఎకరా భూమి రూ. కోటి వరకు ధర పలుకుతుందని, కనీసం తమకు ఎకరాకు రూ. 60 లక్షలతో పాటు ఇంటికో ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి న్యాయం జరిపిస్తామని తహసీల్దార్ చింత రవి హామీ ఇచ్చారు.

ఆత్మహత్యలకు ప్రభుత్వానిదే బాధ్యత

- ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియ
- ఆటోడ్రైవర్ మృతదేహంతో ఆటో యూనియన్ ర్యాలీ



ఇల్లెందు, మే 28 : రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటినుంచి ఆటోడ్రైవర్ల ఆత్మహత్యలు ప్రారంభమయ్యాయని, వారి మరణాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ అన్నారు. మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఇల్లెందు పట్టణంలో పాసి దుర్గాప్రసాద్ అనే ఆటోడ్రైవర్ ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే.. బుధవారం మాజీ ఎమ్మెల్యే హరిప్రియనాయక్ ఆటోడ్రైవర్ ఇంటికి వెళ్లి మృతదేహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత బస్సు పథకం పెట్టి ఆటో కార్మికులను మర్చిపోవడం సరికాదని అన్నారు. ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండో సంవత్సరం పూర్తి కావస్తున్నప్పటికీ అతీగతీలేదని మండిపడ్డారు. రాష్ట్రంలో ఉచిత బస్సు పథకం వల్ల ఆటోలు సరిగా నడవక ఆటోడ్రైవర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అందుకే దుర్గాప్రసాద్ మృతిచెందాడని ఆటో యూనియన్ నాయకులు ఆవేదన వ్యక్తంచేశారు. యూనియన్ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి దుర్గాప్రసాద్ మృతదేహంతో ఇల్లెందు ప్రభుత్వ దవాఖాన నుంచి జగదాంబ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఆటోడ్రైవర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో పార్టీ పరిస్థితేమిటి?

- క్షేత్రస్థాయిలో ఏం జరుగుతున్నది?
- సర్కారుపై ప్రజల అభిప్రాయమేంటి
- నేతలను ఆరా తీసిన నటరాజన్
- నియోజకవర్గాల వారీగా సమీక్షలు
- నిబంధనలకు విరుద్ధంగా ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మీటింగ్
- పరిస్థితులను చక్కదిద్దాలనే ఆలోచనలో హైదరాబాద్‌కు..
- మంత్రి పదవి కోసం నేడు ఢిల్లీకి మాదిగ ఎమ్మెల్యేల పయనం?

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వ పరిస్థితిపై ఆ పార్టీ అధిష్ఠానం ఓ అంచనాకు వచ్చినట్టున్నది. రోజురోజుకు పరిస్థితి 'చేయి' దాటిపోతుండటంతో రాహుల్‌గాంధీ నమ్మిన బంటు, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌ను అధిష్ఠానం రంగంలోకి దించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఢిల్లీ పర్యటన నుంచి వచ్చిన మరుసటి రోజే ఆమె హుటాహుటిన హైదరాబాద్‌లో వాలిపోయారు. ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డికి రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం, అదే సమయంలో మహేశ్‌కుమార్‌గౌడ్ కుటుంబ సభ్యులకు కూడా ప్రత్యేకంగా సమయం ఇవ్వడంతో రాహుల్‌గాంధీకి, రేవంత్‌రెడ్డికి మధ్య పొసగడం లేదనే అభిప్రాయాలు మరింత బలపడ్డాయి. మంత్రి పదవులు, పీసీసీ కార్యవర్గ పదవుల పంపకంపై ఈ ఇద్దరి మధ్య భిన్నాభిప్రాయాలున్నట్టు తెలిసింది. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి మూడు రోజులపాటు ఢిల్లీలో ఉన్నప్పటికీ రాహుల్‌గాంధీని కలవకుండానే హైదరాబాద్‌కు తిరుగుపయనమయ్యారు. ఈ నేపథ్యంలో ఢిల్లీ పరిణామాలు రాష్ట్రంలో ఏమైనా ప్రభావం చూపుతాయనే భావనో, లేక పరిస్థితులను చక్కదిద్దాలనే ఆలోచనో తెలియదు కానీ, మీనాక్షి నటరాజన్ ఆగమేఘాలపై హైదరాబాద్‌కు చేరుకున్నారు.

సమన్వయం ఎలా ఉన్నది?

బుధవారం ఉదయం హైదరాబాద్‌కు చేరుకున్న మీనాక్షి నటరాజన్.. హైదర్‌గూడలోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకు పార్లమెంట్ నియోజకవర్గాలవారీగా సమీక్ష నిర్వహించారు. తొలి రోజు ఆదిలాబాద్, పెద్దపల్లి నియోజకవర్గాల పరిధిలోని ఎమ్మెల్యేలతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ఆమె ఆరా తీసినట్టు తెలిసింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఏవిధంగా ఉన్నది? ప్రభుత్వం గురించి ప్రజలు ఏమనుకుంటున్నారు? క్షేత్రస్థాయిలో పార్టీలో, ప్రభుత్వంలో ఎలాంటి పరిణామాలు జరుగుతున్నాయి? స్థానికంగా ఏమైనా సమస్యలున్నాయా? నియోజకవర్గ నేతల మధ్య సమన్వయం ఏవిధంగా ఉన్నది? అనే అంశాలపై ఆమె ఆరా తీసినట్టు తెలిసింది. సమస్యలు ఏమీలేవన్న వారితో రెండు మూడు నిమిషాల్లోనే భేటీ ముగించగా, సమస్యలు ఉన్నాయని చెప్పినవారితో ఎక్కువ సమయం మాట్లాడినట్టు తెలిసింది. సమస్య ఏమిటి? ఎవరెవరి మధ్య ఉన్నది? దానికి పరిష్కారం ఏమిటి? అనే అంశాలపై అడిగి తెలుసుకున్నట్టు సమాచారం.

పదవుల పంపకంపై కసరత్తు

ఢిల్లీలో జరిగిన చర్చల్లో మంత్రి పదవులు, పీసీసీ కార్యవర్గ పదవుల పంపకం దాదాపు కొలిక్కి వచ్చినట్టేనని భావిస్తున్నారు. ఈ నెల 30న మరోసారి జరిగే భేటీలో పదవులు ఖరారయ్యే అవకాశం ఉన్నది. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో ఎమ్మెల్యేలు, కీలక నేతల అభిప్రాయాలను కూడా మీనాక్షి నటరాజన్ సేకరించినట్టు తెలిసింది. తన వద్దకు వచ్చిన వారందరినీ 'మీకు ఏ పదవి కావాలి? మీకు ఏం సమస్యలున్నాయి? అని అడిగినట్టు సమాచారం. దీనికి కొందరు ఏదైనా పర్వాలేదని చెప్పగా, మరికొందరు ఎమ్మెల్యేలు మాత్రం తమకు ఫలానా పదవి కావాలని కోరినట్టు తెలిసింది. ఈ అభిప్రాయ సేకరణ ద్వారా పదవుల తుది జాబితాను రూపొందిస్తారనే చర్చ కాంగ్రెస్ వర్గాల్లో జరుగుతున్నది.

నిబంధనలకు విరుద్ధంగా మీనాక్షి సమావేశం

హైదర్‌గూడలోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో కాంగ్రెస్ పార్టీ నేతలతో మీనాక్షి నటరాజన్ సమావేశం నిర్వహించడం వివాదాస్పదమైంది. పార్టీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఏవిధంగా నిర్వహిస్తారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పార్టీ కార్యక్రమాలు, మీటింగ్‌లు క్వార్టర్స్‌లో నిర్వహించొద్దని అసెంబ్లీ సెక్రటేరియట్ నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉండటమే ఇందుకు కారణం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాతనే 2024 జూలై 5న అసెంబ్లీ సెక్రటేరియట్ నుంచి ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి. 'ఈ క్వార్టర్స్ కేవలం ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేల కోసం కేటాయించినవి. ఇందులో వారికి సంబంధించిన కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. కాబట్టి, వారికి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు క్వార్టర్స్‌లో పార్టీ కార్యక్రమాలు, ప్రచారాలు, ప్రెస్‌మీట్లు వంటివి నిషేధిస్తున్నాం' అని ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారు. అయినప్పటికీ, సొంత ప్రభుత్వంలో వచ్చిన ఆదేశాలను బేఖాతరు చేస్తూ మీనాక్షి నటరాజన్ దర్జాగా క్వార్టర్స్‌లో సమావేశం నిర్వహించడం గమనార్హం.

నేడు ఢిల్లీకి మాదిగ ఎమ్మెల్యేలు!

తమకు మంత్రి పదవి ఇవ్వాలనే డిమాండ్‌పై కాంగ్రెస్ పార్టీకి చెందిన మాదిగ ఎమ్మెల్యేలు పట్టువీడటం లేదు. ఈక్రమంలోనే గురువారం ఢిల్లీ వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అపాయింట్‌మెంట్ కోసం ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది. ఖర్గే అపాయింట్‌మెంట్ లభించిన వెంటనే ఢిల్లీ వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఈసారి మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు ఒక పదవి ఇవ్వాలని పట్టుబడుతున్నారు. ప్రస్తుతం మంత్రివర్గంలో ఉన్న దామోదర రాజనర్సింహ అసలైన మాదిగ కాదనే వాదనను వినిపిస్తున్నారు. మాదిగ ఎమ్మెల్యేలు మందుల సామేలు, లక్ష్మణ్, లక్ష్మీకాంతరావు, సత్యనారాయణ, వేముల వీరేశం బుధవారం పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌తో జరిగిన భేటీలో పలు విషయాలపై ప్రస్తావించినట్టు సమాచారం.

త్వరలోనే పంటనష్ట పరిహారం

- 51,528 ఎకరాలకు.. 51.52 కోట్లు మంజూరు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ): రెండునెలలుగా కురిసిన అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం మంజూరు చేసింది. 29జిల్లాల్లో 41,361మంది రైతులకు సంబంధించి 51,528 ఎకరాల్లో పంటనష్టం సంభవించినట్టు వ్యవసాయశాఖ నివేదించింది. దీంతో పరిహారం కింద ఎకరాకు రూ.10వేల చొప్పున రూ.51.52 కోట్లు నిధులను మంజూరు చేసినట్టు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ నిధులను త్వరలోనే నష్టపోయిన రైతుల ఖాతాల్లో జమ చేస్తామని పేర్కొన్నారు. నష్టపోయిన పంటల్లో వరి 36,424 ఎకరాలు, మొక్కజొన్న 3,266 ఎకరాలు, జొన్న 470 ఎకరాలు, ఉద్యాన పంటలు 6,589 ఎకరాలు, పత్తి 4,753 ఎకరాలతోపాటు, ఇతర పంటలు 477ఎకరాల్లో దెబ్బతిన్నాయని వెల్లడించారు. అలాగే మే నెలలో పంటలకు జరిగిన నష్టపరిహాన్ని కూడా ఇవ్వనున్నట్టు ఆయన వెల్లడించారు.

యువత జీవితాల్లో వెలుగులు నింపాలి

- యువ వికాసం పర్యవేక్షణకు మండలాల్లో ప్రత్యేక అధికారులను నియమించండి : భట్టి విక్రమార్క



హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ): రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా అందే ఆర్థిక తోడ్పాటుతో యువత జీవితాల్లో వెలుగులు నింపాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులకు సూచించారు. రూ.8 వేల కోట్లతో 5లక్షల మంది యువతకు ఉపాధి కల్పించబోతున్నామని, వ్యాపార కార్యకలాపాలు విస్తృతమై రాష్ట్ర జీడీపీ పెరిగే అవకాశం ఉంటుందని చెప్పారు. బుధవారం మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి రాజీవ్ యువ వికాసం అమలుపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్లకు భట్టి పలు కీలక సూచనలు చేశారు. ఆర్థిక సహాయం అందించాం, పని పూర్తయిందని కాకుండా లబ్ధిపొందిన యువత లాభాలు పొందుతున్నారా? లేదా? ఎవరైనా ఇబ్బందులతో వ్యాపారం నిర్వహించలేకపోతే అధికారులు జోక్యం చేసుకొని వ్యాపారాలను పునరుద్ధరించాలని సూచించారు. పర్యవేక్షణకు మండలస్థాయిలో అధికారులను నియమించాలని కోరారు.